వ్యర్థం.. అనర్థం

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటాం. మురుగు, నిల్వ నీరు ఇంటి చుట్టు పక్కల లేకుండా చూసుకుంటే ఆరోగ్యానికి భద్రత దొరుకుతుంది. అయితే వన్‌టౌన్‌లోని పాత బస్టాండ్ వద్ద చేపల వ్యాపారులు, ఫ్రూట్ షాపుల వాళ్లు వ్యర్థాలను ఇష్టారీతిన పారబోస్తుండడంతో దుర్వాసన, అపారిశుధ్య వాతావరణం, దోమల స్వైరవిహారంతో ప్రసాద్‌గార్డెన్స్, దుర్గమాంబ సమాజం ప్రజలు అవస్థలకు గురవుతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని ఈ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



ఫ్రూట్ మార్కెట్ వద్ద పండ్లు, చేపల వ్యర్థాలు



జీవీఎస్ఎన్ శాస్త్రి రహదారి వద్ద కుప్పలుగా కంట్రీ ఉడ్ దుంగలు



చేపల మార్కెట్ వద్ద పేరుకుపోయిన బురద నీరు

- 35వ వార్డు మార్కెట్ వద్ద పేరుకుపోతున్న అపారిశుధ్యం
- చేపల రద్దు.. కుళ్లిన పండ్ల వ్యర్థాలతో వ్యాపిస్తున్న దుర్గంధం
- ఇబ్బంది పడుతున్న ప్రసాద్‌గార్డెన్స్, దుర్గమాంబ సమాజం ప్రజలు

జగదాంబ: డ్రై డే పాటించండి.. ఇంటి పరిసరాల్లో పాత టైర్లు లేకుండా చూసుకోండి.. ఫ్రిజ్, నివాసాల వద్ద నీరు నిల్వ లేకుండా జాగ్రత్త పడండి అని చెబుతున్న జీవీఎంసీ పబ్లిక్ హెల్త్ అధికారులు వార్డులో కుప్పలు కుప్పలుగా చెత్త వేస్తున్న వ్యాపారులను హెచ్చరించకపోవడంతో ప్రధాన మార్కెట్ల వద్ద చెత్త, మురుగు పేరుకుపోయి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ 35వ వార్డు పాత బస్టాండ్ వద్ద ఉన్న ఫ్రూట్‌మార్కెట్‌లో చెత్తను అక్కడే ఉన్న చేపల మార్కెట్ వద్ద వేయడంతో దుర్వాసన.. అపారిశుధ్యం గుట్టలుగా పేరుకుపోతోంది. ఒక పక్క మురుగుపోయిన పండ్లు, మరో పక్క చేపల వ్యర్థాలు కలిసి భరించలేనంత దుర్వాసన వ్యాపిస్తోంది. ఇది దోమల విజృంభణకు కారణమవుతోంది. అసలే సీజనల్ వ్యాధుల కాలం కావడంతో ఎక్కడ మలేరియా, డెంగ్యూ వంటి ప్రమాదకర వ్యాధులు ప్రబలుతాయోననే భయంతో జీవీఎంసీ అధికారులు ప్రజలకు అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కానీ వ్యాపారులు కనీసం స్పందించకపోవడంతో అధికారులు చేపడుతున్న చర్యలు విఫలం అవుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ఫ్రూట్ మార్కెట్ సమీపంలో ఉన్న ప్రసాద్‌గార్డెన్స్, దుర్గమాంబ సమాజం ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు దోమల కారణంగా నిద్రలేని రాత్రిళ్లు గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ సిబ్బంది పరిశుభ్రం చేస్తున్నా ఫలితం ఉండటం లేదని వాపోతున్నారు.

రోడ్డుపై స్క్రాప్‌తో ఇబ్బందులు..

జీవీఎస్ శాస్త్రి రోడ్డును అధికారులు పూర్తిగా విస్మరించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. 35వ వార్డు పరిధిలోని ఈ రహదారిలో పలు టింబర్ డిపోలు, స్క్రాప్ షాపులు ఉన్నాయి. ఈ వ్యాపారులు రహదారిని ఆక్రమించుకుని స్క్రాప్ వాహనాలు, కలప బహిరంగంగానే గుట్టలుగా పేర్చి వ్యాపారాలు చేసుకుంటున్నారు. వారు తమకు సహకరించడం లేదని జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది ఆరోపిస్తున్నారు. ఇక్కడ కలప పెద్ద ఎత్తున ఉండటం వల్ల దోమలతో పాటు పాములు వస్తున్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి వెంటనే రహదారిపై ఉన్న దుంగలు, స్క్రాప్ సామగ్రిని తొలగించి పరిశుభ్రం చేస్తే దోమలు, పాముల సమస్య ఉండదని స్థానికులు చెబుతున్నారు.

దుర్వాసన బాధ.. దోమల బెడద..



ఒక పక్క దుర్వాసన.. మరో పక్క దోమలతో ఇళ్లలో ఉండలేకపోతున్నాం. రోజు నిద్ర లేమితో సతమతమవుతున్నాం. ఇంట్లో చిన్న పిల్లలు ఉన్నారు. ఇటువంటి పరిస్థితిలో పిల్లలకు ఏమవుతుందోనని బెంగగా ఉంటుంది. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

–వానర్ల సుబ్రహ్మణ్యం (బుజ్జి) ప్రసాద్‌గార్డెన్స్, 35వవార్డు

చేపల నీళ్లు దుకాణాల్లోకి వస్తున్నాయి..



రోజూ చేపల వ్యాపారులతో గొడవలు జరుగుతున్నాయి. అయినా వారు వినడంలేదు. రోజు ఉదయం మేము దుకాణాలకు వచ్చే సరికి చేపల వ్యాపారులు తమ దుకాణాలు సర్దుకుని ఇష్టారీతిన వ్యాపారాలు చేసుకుంటున్నారు. చేపల నీళ్లు మా దుకాణాల్లోకి వస్తున్నాయి. ఆ దుర్వాసన భరించలేకపోతున్నాం.

– అలీ, స్క్రాప్ వ్యాపారి, 35వ వార్డు

చర్యలు తీసుకుంటాం..



వర్షాల నేపథ్యంలో అన్ని ప్రాంతాలను పరిశీలించి పారిశుధ్య పనులు చేపడుతున్నాం. ఫ్రూట్ మార్కెట్ వ్యాపారులు, చేపల విక్రయదారులతో మాట్లాడి చర్యలు తీసకుంటాం. వ్యర్థాలు బయట పడేయకుండా బిన్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

– రాజేష్, ఏఎంహెచ్‌వో, జీవీఎంసీ జోన్–4

క్లుప్తంగా

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న ఈవో రమాబాయి, భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ఉదయం ఈవో రమాబాయి ఆధ్వర్యంలో తొలుత గణపతి పూజ చేశారు. అనంతరం అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు స్వయంగా జలాభిషేకం చేశారు. అర్చకుడు శ్రీనివాస్ భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం కూడా అమ్మవారికి భక్తులు జలాభిషేకం చేశారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

దాబాగార్డెన్స్: జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిటు) ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు, యూజీడీ, వెటర్నరీ, పార్కు, కార్యాలయాల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌ను యూనియన్ గౌరవ అధ్యక్షుడు పి. వెంకట్‌రెడ్డి, యూనియన్ జోన్–1, జోన్–6, భీమిలి, గాజువాక నాయకులు ముద్దాడ ప్రసాద్, గొలగాని అప్పారావు బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. విలీన పంచాయతీ కాంట్రాక్ట్ కార్మికుల హైకోర్టు కేసుకి సంబంధించి వాయిదాకు జీవీఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ అడ్వకేట్ హాజరయ్యేలా చూడాలన్నారు. జీవో 36 మేరకు యూజీడీ కార్మికులకు కొత్త వేతనాల అమలుకు ఫైల్ వెంటనే క్లియర్ చేయాలని, మలేరియా కార్మికుల కంటే ప్రమాదకర పరిస్థితుల్లో పని చేస్తున్న వెటర్నరీ, డ్రైవర్లకు ఆక్యుపేషనల్ హెల్త్ అలవెన్స్ వర్తింపజేసి, పబ్లిక్ హెల్త్‌లో పని చేస్తున్న వారికి రూ.21 వేలు, కుక్కలు తరలించే డ్రైవర్లకు రూ.24,500 చెల్లింపు, క్లీన్ ఎన్విరాన్‌మెంట్ వర్కర్‌గా ఆప్కోస్‌లో నమోదు చేసి న్యాయం చేయాలన్నారు.

సీతమ్మధార రైతుబజారులో తనిఖీలు



రైతుబజారులో ధరల పట్టికను పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ ఏడీ యాసిన్

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజారులో బుధవారం జిల్లా వ్యవసాయ, వాణిజ్య మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్ తనిఖీలు చేశారు. సబ్సిడీ టమాటాలు విక్రయిస్తున్న రైతుల వద్దకు వెళ్లి టమాటా నాణ్యతను పరిశీలించారు. రైతుల ఐడీ కార్డులు, కూరగాయల ధరల పట్టికను పరిశీలించి మాట్లాడారు. వినియోగదారులకు నాణ్యమైన టమాటాలు అందిస్తున్నామని యాసిన్ తెలిపారు. ప్రస్తుతం టమాటా ధర విపరీతంగా పెరగడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్కెటింగ్ శాఖ చిత్తూరు జిల్లా నుంచి టమాటాలను లాభం, నష్టం లేని విధంగా కొనుగోలు చేసి సీతమ్మధార రైతుబజారులో అందుబాటులో ఉంచిందన్నారు. బహిరంగ మార్కెట్‌లో కన్న తక్కువ ధరకు వినియోగదారులకు నాణ్యమైన టమాటాలను విక్రయిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే తప్పనిసరి

అగనంపూడి: కరాటే ఆత్మరక్షణ విద్య అని షీల్ట్ ఫోర్స్ కరాటే అకాడమీ డైరెక్టర్ బాబీ అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు, మహిళలు ఈ విద్యను తప్పనిసరిగా నేర్చుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వంద మంది విద్యార్థులకు బెల్ట్‌లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు బి.సత్యనారాయణ, కె.మహేష్, జి.రాము నాయుడు, వి.నిఖిల్, కేశవ్ సురేందర్, శారద తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ దీక్షలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి



వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డితో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



నిరసన దీక్షలో పాల్గొన్న దక్షిణ నాయకులు

దాబాగార్డెన్స్/జగదాంబ : ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, మారణహోమాలను నిరసిస్తూ దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం చేపట్టిన నిరసన దీక్షకు మద్దతుగా నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, పలువురు దక్షిణ నియోజకవర్గం నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కలిసి చర్చించారు. అనంతరం చేపట్టిన దీక్షలో వాసుపల్లితో పాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొలగాని శ్రీనివాస్, బొల్లవరపు జాన్‌వెస్లీ, కార్పొరేటర్ చెన్నా జానకీరామ్, నాయకులు అలపన కనకరెడ్డి, సనపల రవీంద్ర భరత్ తదితరులు పాల్గొన్నారు.

పాడైన రోడ్లు త్వరలోనే బాగు చేస్తాం

'సాక్షి' కథనానికి జీవీఎంసీ కార్యనిర్వాహక ఇంజినీర్ స్పందన

సాక్షి ఎఫెక్ట్..

అల్లిపురం: జీవీఎంసీ 34వ వార్డు పరిధిలో 75 ఫీట్ రోడ్డు, రామకృష్ణా రైతుబజార్ వద్ద గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు శిథిలమై వాహన చోదకలు అవస్థలు పడుతున్నారని 'సాక్షి'లో ప్రచురితమైన 'రోడ్డిలా.. ప్రయాణమెలా?' అనే కథనానికి జీవీఎంసీ జోన్–4 పబ్లిక్ వర్క్స్ కార్యనిర్వాహక ఇంజినీర్ వివరణ ఇచ్చారు. ఇప్పటికే రోడ్ల రిపేర్లకు సంబంధించి టెండర్లు ఖరారు చేశామన్నారు. త్వరలోనే రోడ్లు బాగు చేయనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

రాంగ్ పార్కింగ్‌పై కొరడా

పార్కింగ్ స్థలాల్లో నిర్మాణ పనులపై హెచ్చరించిన ట్రాఫిక్ పోలీసులు



పార్కింగ్ స్థలంలో పనులు చేపడుతున్న వారిని హెచ్చరిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు

సీతమ్మధార: వాహనాల రాంగ్ పార్కింగ్‌పై ద్వారకా జోన్ ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. బుధవారం డైమండ్ పార్క్ నుంచి సంగం, శరత్ థియేటర్ వరకు రాంగ్ పార్కింగ్ చేసిన వాహనదారులకు జరిమానాలు విధించారు. డైమండ్ పార్కు ఎదురుగా గల పార్కింగ్ స్థలంలో ఇసుక, సిమెంట్ వేసి నిర్మాణ పనులు చేపడుతున్న పార్లర్ యజమానిని ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు హెచ్చరించారు. పార్కింగ్ స్థలంలో సొంత పనులు చేయరాదని, తక్షణమే ఖాళీ చేయాలని సూచించారు. ట్రాఫిక్ సమస్య లేకుండా వ్యాపారాలు నిర్వహించుకోవాలని రోడ్డును ఆక్రమించిన టిఫిన్, తోపుడుబళ్ల వ్యాపారులతో అన్నారు. గురుద్వారా, సీతంపేట, డైమండ్ పార్కు, ద్వారకానగర్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనాలకు సంబంధించిన పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. హెల్మెట్ ధరించాలని, రాంగ్ రూట్ ప్రయాణం ప్రమాదకరమని, మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాలు రాంగ్ పార్కింగ్ చేస్తే జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి



వెంకటేశ్వరమెట్ట గ్రంథాలయం ఆవరణలో వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది



లెప్రసీపై డోర్ టు డోర్ సర్వే చేస్తున్న ఆశ వర్కర్

అల్లిపురం: నియమిత సమయంలో పిల్లలకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని ఏఎన్ఎంలు భారతి, మదీనమ్మ తెలిపారు. వెంకటేశ్వరమెట్ట–1, బంగారమ్మమెట్ట సచివాలయాల పరిధిలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం బుధవారం శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆవరణలో చేపట్టారు. ఈ సందర్భంగా వారు గర్భిణులు, బాలింతలను ఉద్దేశించి మాట్లాడుతూ పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయడంతో పాటు తల్లిపాలు తప్పనిసరిగా పట్టించాలని సూచించారు. తల్లి పాలు తాగించడం ద్వారా పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు కార్యక్రమంలో ఆశ వర్కర్ అనురాధ, జీఎన్ఎంలు పాల్గొన్నారు.

లెప్రసీపై అవగాహన..

కుమ్మరవీధి సచివాలయం పరిధిలో బుధవారం ఆశ వర్కర్లు లెప్రసీపై అవగాహన కల్పించారు. ముక్కు నుంచి స్రావాలు కారడం, కంటి సమస్యలు, కండరాల బలహీనత, పాదాలపై పుండ్లు, నొప్పి తెలియకపోవడం, కనుబొమ్మలు లేదా వెంట్రుకలు లేకపోవడం, చర్మంపై లేత రంగు మచ్చలు వంటివి ఉన్నప్పుడు డాక్టరును సంప్రదించాలని ఆశ వర్కర్ పార్వతి అవగాహన కల్పించారు. దీనికి తగిన చికిత్స కూడా ఉందని వివరించారు.

విదేశాల్లో విద్యావకాశాలపై అవగాహన



సదస్సులో పాల్గొన్న ఎస్ఏపీ మేనేజర్ మోహన్, ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు తదితరులు

దాబాగార్డెన్స్: విదేశాల్లో విద్యావకాశాలపై ఏవీఎన్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్‌గా జర్మనీలోని సీమెన్స్ ఎనర్జీకి చెందిన ఎస్ఏపీ మేనేజర్ ఏఆర్ మోహన్ పాల్గొని అక్కడి అవకాశాలు, నిబంధనలు, కంప్యూటర్లు, విద్యా విధానంలో డిజిటలైజేషన్, పరిశ్రమల్లోని పరిస్థితుల్ని విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు, డీన్ డాక్టర్ జి. శంకరనారాయణ, భౌతికశాస్త్ర విభాగాధిపతి డి. సంతోష్‌కుమార్, జువాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎ. అర్చన తదితరులు ప్రసంగించారు. తాజా సాంకేతిక పరిజ్ఞానం, భవిష్యత్‌లో విద్యార్థులు ఎదుర్కొనబోయే వివిధ సవాళ్లను వివరించారు. కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమకారుడికి ఘన నివాళి



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అయ్యంకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి ఉప గ్రంథాలయ అధికారి నూకరాజు తదితరులు



బాలల శాఖా గ్రంథాలయంలో అయ్యంకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయురాలు పార్వతి తదితరులు

దాబాగార్డెన్స్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ ఉద్యమకారుడు, పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్య 134వ జయంతి నిర్వహించారు. ఇన్‌చార్జి ఉప గ్రంథాలయ అధికారి పీవీ నూకరాజు, పోలీస్ కానిస్టేబుల్ నక్కా స్వామి అయ్యంకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇన్‌చార్జి సహాయ గ్రంథాలయ అధికారి ఎల్. రాజేంద్రవర్మ మాట్లాడుతూ అయ్యంకి చేసిన పోరాటాల ఫలితంగానే గ్రంథాలయాలు స్థాపించబడ్డాయని, ప్రతి గ్రామానికి ఒక గ్రంథాలయం ఉండాలని ఆయన కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు పాఠకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల శాఖా గ్రంథాలయంలో..

జీవీఎంసీ 36వ వార్డు పరిధి రంగిరీజువీధిలో గల బాలల శాఖా గ్రంథాలయంలో అయ్యంకి వెంకట రమణయ్య జయంతి నిర్వహించారు. జీవీఎంసీ రామచంద్ర పాఠశాల ఉపాధ్యాయురాలు కె. పార్వతి, పాఠకుడు పి. కొండలరావు పాల్గొని అయ్యంకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి టి. పోలితల్లి మాట్లాడుతూ అయ్యంకి ఆయుర్వేద వైద్యుడు, ప్రకృతి వైద్యుడే కాక సంపాదకుడిగా, గ్రంథాలయ సర్వస్వం పత్రిక స్థాపించారని, 1934, 1948 కాలంలో కోస్తాంధ్రాలో అనేక గ్రంథాలయాలు ఏర్పాటుకు కృషి చేశారన్నారు. 1992లో పద్మశ్రీ అవార్డుతో పాటు అనేక బిరుదులు సొంతం చేసుకున్నారని తెలిపారు. ప్రతి గ్రామంలో గ్రంథాలయాలు ఉన్నాయంటే ఆయన చొరవేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు ఎన్. ఎల్లారావు, ఎం. అప్పారావు, రామచంద్రరావు, రాంప్రసాద్, వై. పద్మ, లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

దంత సంరక్షణతో ఆరోగ్యం



విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ తరుణ్

మురళీనగర్: వ్యక్తిగత ఆరోగ్యానికి దంత సంరక్షణ కీలకమని డాక్టర్ తరుణ్ అన్నారు. స్థానిక మురళీ మాధవ విద్యాలయంలో మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి పర్యవేక్షణలో వీ డెంటల్, వీ హెల్త్‌కేర్ డైరెక్టర్ కె.ఎం.కె. రమేష్ సహకారంతో బుధవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దంత సంరక్షణపై విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. దంతాలను రెండు పూటలా రెండు నిమిషాల పాటు బ్రష్‌తో శుభ్రం చేసుకోవాలన్నారు. కరోనా వచ్చి తగ్గిన అనంతరం శ్వాస సంబంధిత వ్యాధులతో చాలా మంది బాధపడుతున్నారని, 30 ఏళ్లు దాటిన వారు శ్వాస సంబంధిత పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. 200 మంది విద్యార్థులకు దంత సమస్యలపై వైద్య పరీక్షలు నిర్వహించారు. పాఠశాల అధినేత సనపల మురళీధర్, శ్వాస ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మేనేజర్ పి.శ్రీరామ్‌మూర్తి, కార్యదర్శి సిహెచ్.లక్ష్మి, ఉపాధ్యక్షులు సిహెచ్.వరలక్ష్మి, పూర్వాధ్యక్షులు ఎం.శేషామణి, కె.మాధవి, డి.శిరీష, ఎ.రాధ, జి.లక్ష్మి, మురళీ మాధవ విద్యాలయం ప్రిన్సిపాల్ ఎస్. సత్యవతి శిబిరం నిర్వహణకు సహకరించారు.

ప్రశాంత జీవనమే ప్రజాపిత బాబాజీ ఆశయం



బ్రహ్మకుమారీలు, అతిథులను సత్కరిస్తున్న బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధులు

అగనంపూడి: లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ ఓంశాంతి బ్రహ్మకుమారీస్ వ్యవస్థాపకులు ప్రజాపిత బాబాజీ తన యావదాస్తిని దానం చేసి 140 దేశాల్లో శాఖోపశాఖలుగా విస్తరింపజేశారని ముంబైకి చెందిన రాజయోగి బీకే గణేష్ అన్నారు. బ్రహ్మకుమారీస్ అగనంపూడి శాఖ (దివ్యజ్యోతి భవనం) 11వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మానవ జాతి మానసిక పరివర్తనతో ప్రశాంత జీవనం సాగించాలనే సత్సంకల్పంతో ప్రపంచ నలుదిశలా శాఖలు ఏర్పాటు చేశారన్నారు. అనకాపల్లి వర్తక సంఘం అధ్యక్షుడు కొణతాల లక్ష్మీనారాయణ (పెదబాబు) మాట్లాడుతూ బ్రహ్మకుమారీలు చేపడుతున్న ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. విశాఖ జిల్లా కో–ఆర్డినేటర్ రాజయోగి బీకే సోమేశ్వరి, అగనంపూడి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జె.భారతి మాట్లాడారు. ఈ సందర్భంగా సంస్థ ప్రారంభం నుంచి సేవలు అందిస్తున్న 30 మంది బ్రహ్మకుమారీలను సత్కరించారు. కార్యక్రమంలో 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, రిటైర్డ్ హెచ్ఎం బొండా అప్పారావు మాస్టారు, అగనంపూడి ఇన్‌చార్జి బీకే రామకోటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

ఏఐటీయూసీలో చేరిన ఆటో డ్రైవర్లు



ఏఐటీయూసీలో చేరిన ఆటో డ్రైవర్లకు కండువా వేస్తున్న పడాల గోవింద్

సీతమ్మధార: ఆటో డ్రైవర్లంతా సోదర భావంతో ఐక్యంగా ఉండాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ పిలుపునిచ్చారు. సీతమ్మధార ఏఎస్సార్ నగర్‌లోని కమ్యూనిటీ హాల్ వద్ద బుధవారం శ్రీదుర్గా గణపతి ఆటో స్టాండ్ డ్రైవర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీలో చేరిన పలువురు ఆటో డ్రైవర్లకు కండువా కప్పి ఆహ్వానించారు. గోవింద్ మాట్లాడుతూ డ్రైవర్లు ఖాకీ యూనిఫారం ధరించాలని, ఆటోల ఫిటినెస్ సర్టిఫికెట్ పక్కాగా ఉండాలని, ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదని సూచించారు. ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని, మద్యం తాగి ఆటో నడపరాదన్నారు. నగరంలోని ఆటోలకు పార్కింగ్ స్థలాలు, పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటుకు డ్రైవర్లందరూ పోరాటాలకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చంటి, నాని, రవీంద్రరెడ్డి, గణేష్, రాజ్‌కుమార్, నాయుడు, సన్నీ, డీజే, రెడ్డి పాల్గొన్నారు.

బడ్జెట్‌లో 'ఉక్కు'కు తీరని అన్యాయం

అగనంపూడి: కేంద్ర బడ్జెట్‌లో విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు తీరని అన్యాయం చేసిందని సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 1259వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో పాల్గొన్న నరసింగరావు మాట్లాడుతూ కూటమిలో ఉన్నప్పటికీ బీజేపీ ఏమాత్రం సాయం చేయకుండా విశాఖ ఉక్కుకు, రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, పూర్తి సామర్థ్యంతో కర్మాగారం నడిచేలా బడ్జెట్ సహకారం అందివ్వాలని, ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి ఉక్కును సందర్శించిన సమయంలో ఉక్కును ఆదుకుంటామని హామీ ఇచ్చారని, నెలరోజులు తిరగకముందే ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మొండిచేయి చూపడం దారుణమని అన్నారు. బీజేపీ తన పాత విధానాలనే కొనసాగిస్తోందని, ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేయడం ద్వారా ఆదాయం రాబట్టాలనే కుట్రలను కొనసాగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ భాగస్వామ్య పక్షాలుగా ఉన్న టీడీపీ, జనసేన ఈ విషయంలో మేల్కొని విశాఖ ఉక్కు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించబోమని ప్రకటించే వరకు ఉద్యమాలు ఆపేది లేదన్నారు. కార్యక్రమంలో స్టీల్ సిటు అధ్యక్షుడు వై.టి.దాస్, నాయకులు ఎస్.రామారావు, ప్రతినిధులు శ్రీనివాసరాజు, యు.వెంకటేశ్వర్లు, గంగాధర్, నీలకంఠం పాల్గొన్నారు.